
నిశాచరుడు - 1
మధుబాబు

**NISAACHARUDU - 1**

(Serialised in 'Navya' weekly)

By

**MADHUBAABU**

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 94411 94605

First Edition :

**2019**

Price :

**Rs. 110-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# నిశాచరుడు -1

“వస్తున్నారు. ఎవరో అశ్వికులు మహా వేగంగా మన గ్రామంలోకి వచ్చేస్తున్నారు. సావధానంగా ఉండండి అందరూ. ఎందుకైనా సరే సిద్ధంగా నిలబడండి” గ్రామం వెలుపలి నుంచి పడుతూ, లేస్తూ పరిగెత్తుకు వచ్చిన ముసలి ముకుందుడు బిగ్గరగా అరిచాడు.

ఏడు పదుల వయసుకు ఇంకా కొంచెం ఎక్కువే ఉంటుంది అతనికి. నల్లటి రంగులో నిగనిగ మెరిసిపోతూ కనిపించే చిన్న గొర్రెలమందకు అతను యజమాని.

సూర్యోదయం కాకముందే నిద్ర లేచి, ఆ రోజుకు సరిపడే ఆహారాన్ని సిద్ధం చేసుకుని, ఆ తరువాత తన మందను గ్రామం వెలుపల ఉండే అడవి దగ్గరికి తోలుకుపోవటం అతనికి అలవాటు.

గ్రామంలో గాని, గ్రామం వెలుపలగాని, ఏం జరిగినా చిటికెలో తెలిసిపోతుంది అతనికి. చీమ చిటుక్కుమన్నా, జెముడుకాకి చెట్టు కొమ్మల్ని వదిలి ముళ్ళపొదల మీదికి పోయినా, అందుకు కారణాన్ని వెంటనే పసిగట్టగల నేర్పు అతనికి చాలా ఎక్కువగా ఉంది.

"ఎవరై ఉంటారు ముకుందా ఆ అశ్వికులు? ఎందుకు మన గ్రామం వైపుకు రావటం?" అతని అరుపును ఆలకించి, తన ఇంటి చూరులో భద్రపరిచి ఉన్న పొడవాటి బరిశెను అందుకుంటూ అడిగాడు గ్రామపెద్ద.

సురభి రాజ్యంలో ఉంటుంది ఆ గ్రామం. పన్నులు రాబట్టుకోవటానికి తప్ప మరెందుకూ అటుకేసి రారు రాజభటులు. పన్నులు చెల్లించటానికి ఇంకో మూడు మాసాల వ్యవధి ఉన్నది. కాబట్టి వచ్చేది ఎవరోగాని, రాజభటులు మాత్రం ఖచ్చితంగా కాదు.

"మన చక్రవర్తికి, మంకెన నగరాధిపతికి ఏదో విషయం మీద విరోధం ఏర్పడిందిట. మంకెన సైన్యం సరిహద్దుల్ని అధిగమించి యుద్ధానికి సిద్ధపడుతున్నట్టుంది." మూడు సంవత్సరాల క్రిందట మడిచి మూలన పెట్టిన తన ధనుస్సు మీది దుమ్మును అంగవస్త్రంతో అద్దుకుంటూ అన్నాడు అనిరుద్ధుడు.

గ్రామంలో నివసించే పోటుగాళ్ళందరిలోకీ మహాపోటుగాడు అతను. గురి చూసి బాణాన్ని వదిలాడంటే ఎంతదూరంలో ఉన్న శత్రువైనా గుండెల్ని పట్టుకుని విరుచుకుపడి పోవాల్సిందే.

ముకుందుడు రచ్చబండ దగ్గరికి రాకముందు నిశ్శబ్దంగా, నీరసంగా కనిపించిన గ్రామం కాస్తా, రెండే రెండు నిమిషాలలో జాగృతమైపోయింది.

కర్రల్ని పట్టుకున్నారు కొందరు. పాతకాలపు కత్తుల్ని బయటికి తీశారు మరికొందరు. కర్రలు, కత్తులు చేతులకు అందనివారు, క్రింద కనిపించిన రాళ్ళను రప్పల్ని పట్టుకుని, తమ గ్రామపెద్ద చుట్టూ గుమిగూడారు.

"వచ్చేశారు... అరుగో చూడండి" వయోభారంతో వడలిపోయినట్లు కనిపించే తన దక్షిణ హస్తాన్ని జాస్తూ అందరికీ చెప్పాడు ముకుందుడు.

ఎక్కడా ఆగకుండా అతివేగంగా ప్రయాణం చేసి వస్తున్నాయి కాబోలు, నురుగులు కక్కుతున్నాయి అందరికీ కనిపించిన అశ్వాలు. అలసటతో వాడిపోయి ఉన్నాయి వాటి మీది అశ్వికుల మొఖాలు.

రచ్చబండ నలుబది విండ్ల దూరంలో ఉందనగానే ఎగిరి కిందికి దూకారు వారందరూ.

"ఎవరి ఇండ్లలోకి వాళ్లుపోయి వెంటనే తలలు దాచుకోండి. ఎదుటపడి యుద్ధం చేసే ధైర్యం లేని మంకెన నగరాధిపతి క్షుద్ర మాంత్రికుల కాళ్ళు పట్టుకుని, దుష్టశక్తుల్ని మన రాజ్యం మీదికి పంపకం చేస్తున్నాడు" విపరీతమైన దాహంతో ఎండుకుపోయిన గొంతును సవరించుకుంటూ ఆదుర్దాగా చెప్పాడు వారిలో ఒకతను.

ఆ మాటల్ని విన్నవెంటనే అక్కడ ఉన్న వారందరూ తలా ఒక పక్కకు పరిగెత్తుకుపోతారని అనుకున్నాడు కాబోలు అతను. అటువంటిది ఏదీ జరగకపోవడంతో ఒకింత ఆశ్చర్యంగానే చూశాడు.

"నా మాటలు మీకు అర్థం కాలేదా? మంకెన నగరాధిపతి పంపకం చేయించిన దుష్టశక్తులు విచ్చలవిడిగా వచ్చి పడబోతున్నాయని చెపుతుంటే మీకెవరికీ భయం కలగటం లేదా?" అడిగాడు.

"ఇంతకీ మీరు ఎవరో మాకు చెప్పనే లేదు" పరమప్రశాంతంగా అతన్ని ప్రశ్నించాడు గ్రామపెద్ద.

"అయ్యా... మేము చక్రవర్తి గూఢచారి దళానికి చెందినవాళ్ళం. మంకెన నగరాధిపతి పన్నుతున్న మాయోపాయాల గురించి తెలుసుకుని, మన చక్రవర్తిని హెచ్చరించటానికి పోతున్నాము" వెంటనే చెప్పాడు అప్పటివరకూ మౌనంగా నిలబడి ఉన్న అశ్వికుల్లో మరొక మనిషి.

"చక్రవర్తిని హెచ్చరించాలంటే మీరు రాజధాని నగరానికి వెళ్ళాలి. రాజధాని ఇటువైపు లేదు. అటువైపు ఉన్నది" గ్రామానికి ఉత్తరదిశలో ఉన్న చిన్నచిన్న కొండగుట్టల్ని చూపిస్తూ అన్నాడు ముకుందుడు.

"అదే ఇప్పుడు మాకు ఎదురైన సమస్య. కొండగుట్టల సమీపంలోకి పోకముందే నేలను చీల్చుకుని మా మీదికి వచ్చిపడ్డాయి కొన్ని వికృతాకారాలు. మా సహచరులు ఇద్దర్ని బలి తీసుకున్నాయి. మేము దారి మార్చుకుని ఇటుగా పారిపోయి వచ్చాము" భయం భయంగా వెనక్కి చూస్తూ చెప్పాడు మరో మనిషి.

అప్పుడు కూడా రాలేదు చలనం అక్కడ గుమికూడి ఉన్న వారిలో. "మీరు గూఢచారి దళానికి చెందినవారు కాదు. మీరు మంకెన నగరం

వైపు నుంచి రాలేదు. అడవికి ఆవల ఉండే విరూపాక్ష నగరం మీది. అమాయకులైన గ్రామీణుల్ని ఏదో ఒక విధంగా బెదిరించి, భయపెట్టి గ్రామాలకు గ్రామాల్ని దోచుకునే బందిపోట్లు". తన మందలోని గొర్రెల్ని అదిలించేందుకు ఉపయోగించే పొడుగాటి వెదురు గడను స్థిరంగా పట్టుకుని చాలా నెమ్మదిగా చెప్పాడు ముకుందుడు.

అప్పటివరకూ ఆ అశ్వికుల మొఖాల్లో కనిపించిన అలసట, భయం, ఉద్వేగం మొదలైన భావాలన్నీ చటుక్కున మాయం అయిపోయాయి.

"మనం ఎవరిమో తెలిసిపోయింది. ఇంక ఆలస్యం అనవసరం." అంటూ తన దట్టీలో దోపి ఉన్న పొడవాటి ఖడ్గాన్ని బయటికి తీశాడు ఆ మనిషి.

"రండి... రండి... వచ్చేయండి" బిగ్గరగా అరిచాడు అతని వెనుకే నిలబడి ఉన్న మనిషి.

వారు వచ్చిన మార్గానికి అటూఇటూ ఉన్న పొదల చాటునుంచి వేగంగా పరిగెత్తుకు వచ్చారు ఆయుధాలు ధరించి ఉన్న ఆగంతకులు మరో పదిమంది.

"కొట్టండి... నరకండి... నాశనం చేసేయండి" కరుకు కంఠంతో బిగ్గరగా అరుస్తూ, తన ఆయుధంతో ముసలి ముకుందుడి మీదికి లంఘించాడు మొట్టమొదటగా మాట్లాడిన మనిషి.

భయం అంటే ఏమిటో తెలియని మనిషి ముసలి ముకుందుడు. తన చేతిలోని వెదురు గడను అడ్డంగా తిప్పి అతని ఆయుధాన్ని అడ్డుకోవటానికి ప్రయత్నించాడు.

పదునైన ఆయుధం ఆ మనిషి చేతిలో ఉన్న ఖడ్గం. వెదురుగడ మధ్యకు విరిగిపోయింది.

"ఇప్పటివరకూ మూడు గ్రామాల్ని దోచుకున్నాము. మేము చెప్పిన మాటల్ని విని భయంతో బెంబేలెత్తిపోయిన వారేగాని, మేము ఎవరిమో, ఎక్కడినుంచి వచ్చామో తెలుసుకున్నవాళ్ళు ఎవరూ లేరు. నీవంటివాడు బతికి ఉండకూడదు" అంటూ ఎడమ పాదంతో ముసలి ముకుందుడి గుండెలమీద తన్నాడు ఆ బందిపోటు.

తట్టుకోలేకపోయాడు ముకుందుడు. తడబడకుండా ఉండటానికి ప్రయత్నం చేశాడు గాని, ఫలించలేదు. తూలి వెనక్కి పడిపోయాడు.

"చావు... చావరా ముసలివాడా... చచ్చిపో" అంటూ కత్తిని ఎత్తి అతని శిరస్సు మీద కొట్టబోయాడు బందిపోటు.

తమను, తమ ఆయుధాల్ని చూసి విపరీతమైన భయంతో గ్రామస్థులు చెల్లాచెదురైపోతారని అనుకున్నారు. అటువంటి పనేమీ చేయకుండా కలిసి కట్టుగా తమను ఎదిరించటాన్ని గమనించిన మిగిలిన బందిపోట్లు విపరీతమైన ఆవేశంతో తమ ఆయుధాల్ని తిప్పుతున్నారు.

గిరగిరా తిరుగుతున్న ఆ కత్తులకు అందకుండా, పట్టుదలగా ఎదిరిస్తున్న గ్రామస్థులకు అడ్డుపడకుండా ఎలా వచ్చాడో, అసలు ఎప్పుడు వచ్చాడో ఎవరికీ తెలియకుండా, ఆ గుంపులోకి జొరబడ్డాడు శంభుడు.

సూటిగా ముకుందుడి దగ్గరికి వచ్చి అమాంతం గాలిలోకి ఎగిరి ఆ కత్తిని ఎత్తుతున్న బందిపోటు భుజాలమీద పడ్డాడు. పాదాలతో అతని శరీరాన్ని చుట్టి, పొడవైన అతని కేశాల్ని పిడికిళ్ళలో బిగించి తలను వెనక్కి వంచాడు.

"వదులు... వదలరా... వదిలేయ్... చంపేస్తాను నిన్ను... నరికి పోగులు పెడతాను... వదిలేయ్" కీచుగా అరిచి తన వామహస్తంతో అతన్ని తన భుజాల మీది నుంచి క్రిందికి నెట్టేందుకు చూశాడు బందిపోటు.

వదిలిపెట్టే ఆలోచనలేదు శంభుడికి "అవతలికి వెళ్ళిపో తాతా... వెళ్ళిపో" అని క్రింద ఉన్న ముకుందుడిని హెచ్చరిస్తూ, ఎడమ పిడికిలితో బందిపోటు నడినెత్తి మీద బలంగా వేశాడు ఒక దెబ్బ.

కళ్ళు గిర్రున తిరిగినట్లున్నాయి ఆ బందిపోటుకి. బలంగా వీచే గాలికి అడ్డుగా నిలబడినట్టు అటూ ఇటూ తూలాడు.

అదే సమయంలో క్రిందనుంచి లేచాడు ముకుందుడు. బందిపోటు చేతిలోని కత్తి తన ఒంటికి తగలకుండా అవతలికి చూశాడు.

పోరాటం ప్రారంభం అయిన వెంటనే గ్రామ పెద్ద దగ్గర నిలబడకుండా దూరంగా పరిగెత్తాడు విలువిద్యలో నిపుణుడైన అనిరుద్ధుడు.

మూడు మూరల పొడవు ఉన్న ఒక పదునైన బాణాన్ని వింటికి తొడిగి నేర్పుగా వదిలాడు.

రివ్వున దూసుకు వచ్చింది అది. భుజాలమీది శంభుడిని క్రిందికి నెట్టే ప్రయత్నం చేస్తున్న బందిపోటు కంఠంలో దిగబడింది.

గట్టిగా పట్టుకుని ఉన్న తన కత్తిని వదిలి, మొదలు నరికిన చెట్టు మాదిరి నేలకూలిపోయాడు అతను.

క్రింద పడిపోయిన అతని కత్తిని తను అందుకున్నాడు శంభుడు. కీచుగా అరుస్తూ చిందులు తొక్కుతున్న జనంలోకి దూరిపోయాడు.

ఎంతోసేపు కొనసాగలేదు గందరగోళం. అనిరుద్ధుడి బాణం బందిపోటు నాయకుడిని బలి తీసుకున్న మూడో క్షణంలో అంతం అయిపోయింది.

ప్రాణాలు వదిలిన తమ సహచరుల శరీరాల్ని గురించి పట్టించుకోలేదు మిగిలిన బందిపోట్లు. గాయాలపాలై నేలకూలిపోయిన వారిని గురించి కూడా ఆలోచించలేదు. ఉన్నట్లుండి వెనుతిరిగి వేగంగా పరిగెత్తారు. ముందుగా వెళ్ళినవారు విశ్రాంతిగా నిలబడి ఉన్న అశ్వాలను అధిరోహించారు. వెనుకగా పోయినవారు సూటిగా పొదలను సమీపించి వాటి వెనుక మటుమాయం అయిపోయారు.

* * * * *

గ్రామం వెలుపల చిన్న మెరక ప్రదేశం మీద ఉన్న తన గడ్డిమేటులో నుంచి పది కట్టల వరి గడ్డిని తెప్పించాడు గ్రామపెద్ద. కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక ఇంటినుంచి కొద్దిపాటి కలపను తను దగ్గర ఉండి మోయించుకు వచ్చాడు.

నలుగురు బందిపోట్లు ప్రాణాలు వదిలారు. నలుగురు తీవ్రమైన గాయాలతో గిలగిలా కొట్టుకుంటున్నారు.

ప్రాణాలు వదిలిన వారందరినీ గుంపుగా గడ్డి మోపుల మీద పడుకోబెట్టి, దగ్గరుండి మోయించుకు వచ్చిన కలపను చక్కగా మీద పేర్పించి, దహన సంస్కారాలు చేయించాడు గ్రామపెద్ద.

"గాయాలపాలైన వారికి చికిత్స చేయించి తెల్లవారే సమయానికి మీరు ఏదో ఒక విధంగా గ్రామంలో నుంచి వెళ్ళిపోవాలి. ఎలా వెళతారో నాకు అనవసరం. నేను నిద్రలేచి ఇంటి వెలుపలికి వచ్చేసరికి మీరు నాకు కనిపించకూడదు. కనిపిస్తే సజీవ దహనమే" అని హెచ్చరించాడు.

"పెద్దయ్యా... ముసలి ముకుందుడు కనిపించటంలేదు" ఉన్నట్టుండి అతని ఎదుటికి వస్తూ చెప్పాడు ఒక గ్రామస్థుడు.

ఝల్లుమన్నట్టున్నాయి గ్రామపెద్ద గుండెలు. అయితే తన అలజడిని వెంటనే కప్పిపెట్టుకున్నాడు.

"ఈ దొంగ వెధవల్ని గమనించిన వెంటనే మనల్ని హెచ్చరించటానికి పరిగెత్తుకు వచ్చాడు. తన మందను అడవికి దగ్గరగా వదిలేసి మరీ వచ్చినట్టున్నాడు. వాటికోసం వెళ్ళి ఉంటాడు" అన్నాడు బింకంగా.

"మందకోసం వెళ్ళి ఉంటే ఈసరికి వచ్చేసి ఉండాలి. ఇంకా కాసేపటిలో చీకటి పడిపోతుంది. చీకటి సమయంలో అడవికి దగ్గరగా" అంటూ ఆపైన మాట్లాడలేక మౌనం వహించాడు ఆ గ్రామస్థుడు.

ఎలుగులు, పగోలాలు, చిరుతలు, కొండచిలువలు కనిపిస్తాయి ఆ గ్రామానికి ఆనుకుని ఉన్న అడవిలో. పగటి సమయంలోనే అటుకేసి పోవటం ప్రమాదభరితం. ఇంక చీకటి పడితే–

గ్రామపెద్దకు కూడా ఆ పైన ఊహించటానికి భయం వేసింది. "కాగడాలను సిద్ధం చేయండి. బరిశెల్ని, గొడ్డళ్ళను అందుకోండి" అని ఆజ్ఞ ఇచ్చి, మౌనంగా నిలబడి ఉన్న తన భార్యవైపు చూశాడు.

"మీరు ఎవరూ అతిగా ఆత్రపడి కాళ్ళు తొక్కుకోవద్దు. ఇక్కడ గందరగోళం చల్లబడిన వెంటనే ముసలి ముకుందుడు అడవికేసేపోయాడు. వెంట మన శంభుడు ఉన్నాడు" బింకంగా చెప్పింది ఆమె.

భగభగలాడుతున్న మంట మీద చన్నీరు కుమ్మరించినట్టు చటుక్కున అణిగిపోయింది గ్రామపెద్ద ఆత్రుత.

అవసరం అయితే ముసలి ముకుందుడికి సహాయం చేసేందుకు మరో మనిషి ఉన్నాడు. బాగానే ఉంది. కాని ఆ మనిషి వేరే ఎవరో కాదు, శంభుడు.

అణిగిపోయిన ఆత్రుత రెట్టింపయిన అనుమతి గ్రామపెద్దను ఆవరించుకున్నది.

తల వంచుకుని తమ దారిన తాము వెళ్ళిపోయే కాలనాగుల్ని కూడా తోకలు పుచ్చుకుని ఇవతలికి లాగి పడవేసే దుడుకు స్వభావం శంభుడిది. అర్ధరాత్రిళ్ళు అడవి వైపు నుంచి వినవచ్చే వికృత శబ్దాలను విని తలుపుల్ని గట్టిగా బిగించుకుని కూర్చుంటారు గ్రామంలోని పెద్దవాళ్ళు. కంబళీలు ముసుగు పెట్టుకుని భయంతో గజగజలాడిపోతారు పిల్లలు.

మూడు మూరల కర్రపుల్ల నొకదాన్ని పట్టుకుని ఒంటరిగా వీధిలోకి వచ్చేస్తాడు శంభుడు. వట్టి మూర్ఖుడు.

"ముసలి ముకుందుడు పక్కన ఉన్నాడు. ఆ పిల్లాడిని అదుపు చేయగలవాళ్ళు ఎవరైనా ఉన్నారంటే, అది ముకుందుడే. మరేం పరవాలేదు" తన అభిప్రాయాన్ని ఆలస్యం చేయకుండా వెలువరించింది గ్రామపెద్ద భార్య.

"సరే సరే... శంభుడికి ఎటువంటి ప్రమాదమూలేదు. ముకుందుడు కూడా క్షేమంగానే ఉంటాడు. ఎదురుచూడని విధంగా వచ్చిపడిన ఈ దొంగల మూలంగా మన పనులన్నీ చెడిపోయాయి. అందరూ ఇళ్ళకు పొండి. దెబ్బలు తగిలినవాళ్ళు నిర్లక్ష్యం చేయకుండా చికిత్స చేయించుకోండి" అంటూ ఒక పక్కగా కూర్చుని ఉన్న రుద్రయ్య వంక చూశాడు గ్రామపెద్ద.

కాలునొచ్చినా, కన్నునొచ్చినా, ఆడవారికి కాన్పు కష్టం అయినా, అపర ధన్వంతరి మాదిరి ఆదుకునే వైద్యుడు ఆ రుద్రయ్య.

"మనవాళ్ళందరినీ ఎప్పుడో పరీక్ష చేశాను. గీచుకుపోవటాలు, రాసుకుపోవటాలు తప్ప ఎవరికీ చెప్పుకోదగ్గ గాయాలు లేవు. వీళ్ళ సంగతే నాకు అనుమానంగా ఉంది" అన్నాడు రుద్రయ్య, అక్కడ గ్రామపెద్ద ఇంటిముందున్న గానుగచెట్టు క్రింద కూర్చోబెట్టబడిన బందిపోట్లను చూస్తూ.

"ఎంత దొంగలయినా వాళ్ళుకూడా మనలాంటి మనుష్యులే. చూస్తూ చూస్తూ నిర్లక్ష్యం చేయలేము. చికిత్స అంటూ జరిగింది కదా. ఆయువు ఉంటే బతికి బట్టకడతారు. లేదంటే మనకు ఇంకో పది గడ్డిమోపులు" అంటూ తన ఇంట్లోకి వెళ్ళిపోయాడు గ్రామపెద్ద.

ఒకరి తరువాత ఒకరుగా ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు గ్రామస్థులు అందరూ.

ఇరువది సంవత్సరాలు నిండిన ఇద్దరు యువకులు మాత్రం గానుగచెట్టు దగ్గర ఒక బండరాయి మీద కూర్చున్నారు.

పావుగడియ గడిచిన తర్వాత చిన్నగా దగ్గి గొంతు సవరించుకున్నాడు ఒక బందిపోటు.

బండమీది యువకులు ఇద్దరూ చటుక్కున తలలు తిప్పి అతనికేసి చూశారు.

"అయ్యలూ... మాకు బుద్ధి వచ్చింది. మా కంఠాల్లో ప్రాణం ఉండగా ఇంకోసారి మీ గ్రామం మీదికి వచ్చేదిలేదు" చిన్నగా అన్నాడు అతను.

"నోరు మూసుకుని కూర్చోండి... అనవసర ప్రసంగం వద్దు" కరుకుగా అన్నాడు ఒక యువకుడు.

"ఎక్కువగా మాట్లాడి మిమ్మల్ని విసిగించాలనే కోరిక నాకులేదు. కాని నాకు చిన్న అనుమానం వచ్చింది. మీరు అనుమతిస్తే అడుగుతాను" వినయాతి వినయంగా అన్నాడు ఆ బందిపోటు.

కోపంగా చూడబోయిన యువకుడి భుజం తట్టాడు అతని సహచరుడు. "నోరు మూసుకుని బొడ్డురాయి మాదిరి కూర్చోవడం నాకు కూడా విసుగ్గానే ఉంది. మాట్లాడనీ... ఏం మాట్లాడతారో చూద్దాం" అన్నాడు.

"ఏమిటి నీ అనుమానం?" కోరగానే అడిగాడు మొదటి యువకుడు.

"గుంపుగా వచ్చిన మమ్మల్ని చూసి బెదిరిపోకుండా చిరుతపులుల మాదిరి ఎదురు తిరిగారు మీరందరూ. కాయకష్టం చేసుకుని బతికే మీకు అంతటి తెగింపు ఎక్కడినుంచి వచ్చింది?" అడిగాడు బందిపోటు.

ఫక్కున నవ్వాడు యువకుడు.

"అయ్యా... నవ్వులాట కాదు. నిజమైన అనుమానమే" మరింత వినయంగా అన్నాడు బందిపోటు.

"కాయకష్టం చేసుకు బతికే మా పెద్దలు ఒకప్పుడు చక్రవర్తి సైన్యంలో చేరి జేజేలు అందుకున్న సైనికులు. వెదురుగడతో మీ నాయకుడిని ఎదిరించ బోయిన ముసలి ముకుందుడు ఇప్పుడున్న మంత్రిగారి తండ్రివద్ద పనిచేసినవాడు..." సగర్వంగా చెప్పాడు ఆ యువకుడు.

"మరి మా నాయకుడి భుజాల మీదికి ఎక్కి దెబ్బతీసిన కుర్రవాడు...?" అడిగాడు బందిపోటు.

"పదహారు సంవత్సరాల క్రితం అడవి మొదట్లో కట్టెలకోసం వెళ్ళిన మా గ్రామస్థులకు దొరికిన పిల్లవాడు... తల్లిదండ్రులు ఎవరో తెలియదు. పొత్తిళ్ళలో గుక్కపట్టి ఏడుస్తూ కనిపించాడు."

"గ్రామపెద్దగారు తీసుకువచ్చి పెంచుకున్నారా?"

"లేదు. గ్రామం మొత్తం కలిసి శంభుడిని పెంచి పెద్దచేసింది. వాడు మా వాడు. మా అందరివాడు" అన్నాడు ఆ యువకుడు.

"ఒక్క వైరూపుడికి తప్ప..."వెంటనే అన్నాడు రెండవ యువకుడు.

వెంటనే అందుకున్నాడు బందిపోటు. "అయ్యా... ఆ వైరూపులవారు ఎవరు?" అని అడిగాడు.

నోటికి సరిపడని పదార్థం ఏదో ఆరగించినట్టు మొఖం పెట్టాడు మొదటి యువకుడు.

"మాకు అవసరమైన సరుకులన్నిటినీ రాజధాని నుంచి తెప్పించి, విక్రయించే వ్యాపారి మా వైరూపుడు. మొదటి నుంచీ శంభుడు అంటే సరిపడదు" అన్నాడు రెండవ యువకుడు.

"మమ్మల్ని ఎదిరించినవారిలో ఆ వైరూపులవారు ఎవరై ఉంటారో" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు బందిపోటు.

"తన ఇంటి గడపను దాటి వీధిలోకి అడుగు పెట్టే అలవాటు లేనివాడు. పనులన్నీ పూర్తి అయిన తర్వాత వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడటం మాత్రం బాగా వచ్చు. ఈ రోజు మాత్రం ఇంకా వెలుపలికి రాలేదు. కారణం ఏమై ఉంటుంది?" బందిపోటుకు చెపుతూ, తన సహచరుడిని అడిగాడు రెండవ యువకుడు.

"ఈ బందిపోట్లను ప్రాణాలతో వదిలేయాలని గ్రామపెద్ద చెప్పిన మాటలు చెవినపడి ఉంటాయి. తన సుందరవదనారవిందం వాళ్ళకు గుర్తుండిపోతే, భవిష్యత్తులో తనకు బహు ప్రమాదమని బయటికి వచ్చి ఉండడు..." నవ్వుతూ చెప్పాడు మొదటి యువకుడు.

ఆ పైన ఏం మాట్లాడాలో తెలియలేదు. కాసేపు మౌనంగా ఉండి పోయాడు బందిపోటు.

మొదటిజాము గడిచి రెండవ జాము అడుగుపెడుతుండగా బండమీది నుంచి లేచాడు ఒక యువకుడు.

"మందను తోలుకుని ముకుందుడు ఈసరికి వచ్చేసి ఉండాలి. రాకపోవటానికి కారణం ఏమై ఉంటుంది?" అని అడిగాడు.

❈ ❈ ❈ ❈ ❈

బెత్తెడు మాత్రమే ఉన్న తోకను మౌనంగా కదిలిస్తూ, తలను పైకెత్తి పెద్దగా శబ్దం చేయబోయింది మంద వెనుకభాగంలో ఉన్న గొర్రెపిల్ల.

చటుక్కున చెయ్యి జాచి దాని నోటిని అదిమేశాడు శంభుడు. "అరవకే మొద్దుమొఖమా... అడవిలోకి వినబడిందంటే నువ్వు, నీతోపాటు మేము అందరమూ హతమారిపోతాము" ముందుకు వంగి సున్నితంగా చెప్పాడు దాని చెవి దగ్గర.

మంద ముదుభాగంలో నిలబడిన ముకుందుడి పెదవులమీద ప్రత్యక్షమై వెంటనే మాయమై పోయింది ఒక చిరునవ్వు.

శంభుడి మాటల్లో యదార్థం కానిది ఏమీలేదు. అడవి మీదినుంచి గ్రామం వైపు వీస్తోంది గాలి. తన మందకు సంబంధించిన వాసనలన్నీ గ్రామం వైపుకే పోతున్నాయి. అడవిలో ఉన్న జంతువులకు ఆ మంద ఉనికి తెలియటం లేదు.

గాలి వీచే దిశ మారినా, మందలోని జీవుల శబ్దాలు చెవులకు చేరినా, గంతులు వేసుకుంటూ వచ్చేస్తాయి. వంతులు వేసుకుని మరీ సర్వనాశనం చేసేస్తాయి.

"వెళ్ళిపోదాం తాతయ్యా. వీటిని కాపలా కాయటం చాలా కష్టం" ఉన్నట్లుండి అతనికి మాత్రమే వినబడేటట్లు చిన్నకంఠంతో అన్నాడు శంభుడు.

"నిజమేరా శంభుడూ... కష్టమే. కాని ఇప్పుడు గనక మనం ఇక్కడినుంచి కదిలితే ఇంకో ప్రమాదంలో చిక్కుపడతాము" తను కూడా చిన్నగానే చెప్పాడు ముకుందుడు.

"ఇంకో ప్రమాదమా? అదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శంభుడు.

"దగ్గరికి రారా, చూపిస్తాను"అన్నాడు ముకుందుడు.

ఎందుకైనా మంచిదని, అంతకుముందు అరవబోయిన గొర్రెపిల్లను చేతుల్లోకి ఎత్తుకుని ముందుకు పోయాడు శంభుడు. తాత దగ్గిర నిలబడి ప్రశ్నార్థకంగా చూశాడు.

"నా మొఖంలోకి కాదురా... అటుకేసి చూడు" అంటూ చేయి ముందుకు చాపాడు ముకుందుడు.

కనులు చిట్లిస్తూ అటు చూసిన శంభుడికి ఝల్లుమన్నది ఒళ్ళు.

ఖచ్చితంగా మూడు వందల ధనువుల దూరంలో తమ అశ్వాలను ఒకచోట గుంపుగా నిలబెట్టి, తాము ప్రయాణం చేయవలసిన దారిలోనే తిష్ఠవేసి కూర్చున్నారు దగ్గర దగ్గరగా మూడు వందల మంది గుర్తు తెలియని వ్యక్తులు.

దగ్గర్లో ఉన్న అడవిని గురించి తమకు బాగా తెలిసినట్లు పెద్దపెద్ద చితుకుల మంటలు వేస్తున్నారు కొందరు.

"నీకు వయసు అయితే వస్తోంది గాని, బుద్ధిమాత్రం పెరగటం లేదు. వాళ్ళ శిరస్త్రాణాలను, ఒంటికి తగిలించుకున్న కవచాలను సరిగ్గా చూడు" చిన్న కంఠంతో చెప్పాడు ముకుందుడు.

చెమటలు ప్రత్యక్షమయ్యాయి శంభుడి మొఖం మీద. "తాతా... వాళ్ళు సైనికులు, మంకెన నగరానికి చెందిన సైనికులు" అన్నాడు అస్పష్టంగా.

"బందిపోట్లు బహుశా వాళ్ళను గమనించే మన గ్రామంవైపు పారిపోయి వచ్చి ఉంటారు. తమభయాన్ని కప్పిపెట్టుకోవటానికి క్షుద్రశక్తులు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nisacharudu+1**

* * *